సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం | 14 | ఏప్రిల్ | 2024



మార్కులు తక్కువ వచ్చాయని..
ఇంటర్మీడియెట్‌లో మార్కులు తక్కువ వచ్చాయని మనస్థాపంతో కుమ్మరిపాలెం గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. 8లో ▸



వేటకు లంగరు
వేట బోట్లకు లంగరు పడింది. 61 రోజుల పాటు సముద్రంలో వేట సాగించే వీలు లేకపోవడంతో బోట్లు ఒడ్డుకు చేరుకుంటున్నాయి. 8లో ▸



గోదావరిలో మృతదేహం లభ్యం
పోలవరం మండలం గూటాల గ్రామ సమీపంలోని గోదావరి నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. 8లో ▸

న్యూస్‌రీల్

పక్కాగా ఈవీఎంల కేటాయింపు



ఈవీఎంలను తరలిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): నియోజకవర్గాల వారీగా ఈవీఎంల తరలింపు ప్రక్రియను అత్యంత కట్టుదిట్టంగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తికాగా శనివారం స్థానిక ఈవీఎం గోడౌన్ వద్ద బీయూలు, సీయూలు, వీవీప్యాట్‌లను విభజించారు. జిల్లాలో లోక్‌సభ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 3,508 బీయూలు, 3,508 సీయూలు, 3,800 వీవీప్యాట్‌లను తరలించాల్సి ఉందన్నారు. వీటిని జీపీఎస్ అమర్చి నియోజకవర్గాల వారీగా వేర్వేరు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచేందుకు తరలిస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ ఆదివారం సాయంత్రానికి పూర్తవుతుందన్నారు. నామినేషన్ల ప్రక్రియ అనంతరం కమిషనింగ్ (ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్‌ను అమర్చడం) చేస్తామని, రెండో విడత ర్యాండమైజేషన్ అనంతరం పోలింగ్ కేంద్రాల వారీగా తరలిస్తామని చెప్పారు. ఈ ప్రక్రియను కలెక్టర్‌తో పాటు జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, రిటర్నింగ్ అధికారులు కె.శ్రీనివాసులు రాజు, ఎం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, బి.శివనారాయణరెడ్డి, ఎన్నికల సిబ్బంది దగ్గరుండి పర్యవేక్షించారు.

వందే భారత్‌ను జిల్లా మీదుగా నడపాలి

భీమవరం (ప్రకాశంచౌక్): వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును నరసాపురం, భీమవరం మీదుగా నడపాలని అలాగే రోజూ నరసాపురం నుంచి బెంగళూరుకు ఎక్స్‌ప్రెస్ నడపాలని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రైల్వే అధికారులకు వినతిపత్రం అందించారు. భీమవరం రైల్వే జంక్షన్ స్టేషన్‌లో శ్రీవిజ్ఞానవేదిక, రైల్వేశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైల్వే వారోత్సవాల్లో ఈ వినతిపత్రం అందజేశారు. స్టేషన్ సూపరింటెండెంట్ వానపల్లి చక్రవర్తి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని రైల్వేస్టేషన్లను సుందరీకరిస్తున్నారని, రైళ్ల సంఖ్య ప్రయాణికులు కూడా పెరిగారన్నారు. స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు కాంతేటి వెంకటరాజు, కుక్కల బాల, జ్ఞానపాటి మధుసూదన్ రావు, ఎండీ సరోజినీ మాట్లాడుతూ డివిజన్‌లో అన్ని స్టేషన్లను అభివృద్ధి చేశారని, నాగర్ సోల్ ఎక్స్‌ప్రెస్‌ను భీమవరం జంక్షన్ స్టేషన్‌లో ఆపాలని కోరారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రైల్వే వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించామన్నారు. ఎస్కే చాన్‌బాషా, జంక్షన్ ఎస్సై రమణ, కానిస్టేబుళ్లు రాజబాబు, ధర్మారావు పాల్గొన్నారు.

ఏలూరు తివాచీ ఉత్పత్తులకు గుర్తింపు

ఏలూరు (టూటౌన్): ఇన్వెస్ట్ ఇండియా పథకంలో భాగంగా 2023లో ఒక జిల్లా–ఒక ఉత్పత్తి కార్యక్రమం కింద ఏలూరు తివాచీ ఉత్పత్తులు గుర్తింపు పొందాయని జిల్లా చేనేత, జౌళి శాఖాధికారి ఎస్.రఘునంద్ తెలిపారు. ఈ ఏడాది నుంచి ఇక్కడి తివాచీ ఉత్పత్తులను ఒక జిల్లా–ఒక ఉత్పత్తి కింద అవార్డుకు సిఫార్సు చేస్తామన్నారు. దీనిలో గుర్తింపు పొందితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గిరాకీ పెరిగి స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఏలూరు సహజ రంగుల తివాచీకి ప్రసిద్ధి అన్నారు. గతంలో వీటిని హారినామ్ కార్పెట్‌లుగా పిలిచేవారన్నారు. ఇరాన్, అరబ్ దేశాలకు చెందిన కార్పెట్ నేత కార్మికులు మచిలీపట్నం పట్టణానికి తివాచీ నేసే కళను పరిచయం చేశారని, తర్వాత ఏలూరులోని తంగెళ్లమూడి ప్రాంతానికి చెందిన కార్మికులు దీనిని స్వీకరించారని తెలిపారు. ఈ తివాచీ డిజైన్లు ఇండో పర్షియన్ మూలానికి చెందినవన్నారు. ఏలూరులోని లక్ష్మీవారపుపేట, తంగెళ్లమూడి ప్రాంతాల్లో సుమారు 40 కుటుంబాలు దేశీయ ఉన్ని, సహజ సిద్ధ రంగులతో తివాచీలు చేస్తున్నారన్నారు. వీరు సొంతంగా, లేపాక్షి సంస్థ ద్వారా ఉత్పత్తులను విక్రయిస్తున్నారన్నారు.

సీఎం జగన్‌పై దాడి పిరికిపంద చర్య

పెనుగొండ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలోని అజిత్ సింగ్‌నగర్‌లో జరిగిన దాడి పిరికిపంద చర్య అని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం రాత్రి ఆయన పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన బస్సు యాత్రలో భాగంగా ప్రతిపక్షాలు ఆయనపై దాడికి దిగడం శోచనీయమన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పా రు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో పూర్తిగా ఆదరణ ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఆయనపై భౌతికంగా దాడి చేయడానికి కూడా పాల్పడుతున్నాయని, ఇది మంచి పద్ధతి కాదని చెప్పారు.

విపత్తు వేళ.. కొండంత అండగా

కరోనా విలయం.. ఆదుకున్న ప్రభుత్వం

కరోనా.. నేటితరం చూసిన అతి పెద్ద విపత్తు. రెండేళ్ల పాటు జనజీవనాన్ని అతలాకుతలం చేసిన మహమ్మారికి యావత్తు ప్రపంచమే వణికిపోయింది. వైరస్‌పై యుద్ధం ప్రకటించిన ప్రభుత్వం లాక్‌డౌన్, ఐసోలేషన్ కట్టుదిట్టంగా అమలుచేసింది. పక్కాగా వైద్య పరీక్షలు నిర్వహించి పాజిటివ్ బాధితులకు ఉచితంగా వైద్యసేవలు, పోషకాహారం అందించింది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధితులకు అండగా నిలిచిన తీరు దేశానికే ఆదర్శంగా నిలిచింది. ప్రజలపై ఇప్పుడు వల్లమాలిన ప్రేమ ఒలకబోస్తున్న విపక్ష నేతలు నాడు పక్క రాష్ట్రంలో తలదాచుకుని రాష్ట్రం వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.



పెనుగొండలో కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

ప్రజారోగ్యమే పరమావధి
- మహమ్మారిపై పోరులో ప్రజలకు కొండంత అండ
- కరోనా కట్టడికి పటిష్ట చర్యలు
- నిరంతరం ఫీవర్ సర్వేలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 46 కోవిడ్ సెంటర్లు
- 7.27 లక్షల పాజిటివ్ కేసుల నమోదు
- బాధితులకు ఉచితంగా వైద్య సేవలు, పోషకాహారం
- 34.79 లక్షల మందికి వ్యాక్సినేషన్
- ప్రజలను కన్నెత్తి చూడని విపత్తు నేతలు

వ్యాక్సినేషన్

మొదటి డోసు	రెండో డోసు	బూస్టర్ డోస్	18 ఏళ్ల పైబడిన వారికి టీకాలు
34,79,105	33,82,114	1,25,097	1,82,710



లాక్‌డౌన్‌తో పెనుగొండలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు (ఫైల్)

కోవిడ్ సేవలు

జిల్లాలో ఆస్పత్రులు		
ప్రభుత్వ : 18	సిద్ధం చేసిన బెడ్లు	25 వేలు
ప్రైవేట్ : 37	కోవిడ్ సెంటర్లు	46
	కోవిడ్ సెంటర్ల నిర్వహణకు ఖర్చు	రూ.56.68 కోట్లు
	నిత్యం చేపట్టిన పరీక్షలు	18 వేలు
	మొత్తం చేసిన పరీక్షలు	39,46,698
	నమోదైన పాజిటివ్ కేసులు	7,27,428
	వైద్య సిబ్బందికి చేసిన ఖర్చు	రూ.26 కోట్లు

సాక్షి, భీమవరం: 2020 మార్చిలో కరోనా వైరస్ కేసులు బయటపడగా ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. వైరస్ వ్యాప్తి చెందకుండా లాక్‌డౌన్ ప్రకటించి ప్రజలను ఇళ్లకే పరిమితం చేసింది. ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి రాష్ట్రానికి వచ్చే వారికి ఎక్కడికక్కడ కోవిడ్ నిర్ధారణ పరీక్షలు, డోర్ టూ డోర్ ఫీవర్ సర్వేలు నిర్వహించి 15 రోజులపాటు కోవిడ్ సెంటర్లు, హోం ఐసోలేషన్‌లో ఉంచేవారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 34 వాహనాల ద్వారా లక్షలాది మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించారు. పాజిటివ్‌గా నమోదైతే వెంటనే రెడ్‌జోన్ ప్రకటించి.. వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచింది. ఉమ్మడి జిల్లాలో 55 ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు, 46 కోవిడ్ సెంటర్లలో 25 వేల బెడ్లు సిద్ధం వైరస్ తీవ్రత అధికంగా ఉన్న వారికి ఉచితంగా వైద్యసేవలు, పౌష్టికాహారాన్ని ప్రభుత్వమే సమకూర్చింది. కోవిడ్ బాధితులను 108 అంబులెన్స్‌ల ద్వారా ఆస్పత్రులు, కోవిడ్ సెంటర్లకు తరలించేందుకు చర్యలు తీసుకుంది. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా హోం ఐసోలేషన్‌లో ఉన్న వారికి పౌష్టికాహారం, మందులు అందించారు. వైరస్ వ్యాప్తిచెందకుండా ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

'ఆక్సిజన'హితంగా.. సెకండ్ వేవ్‌లో వైరస్ విజృంభణ అధికంగా ఉండటంతో సహాయక చర్యలను ప్రభుత్వం మరింత ముమ్మరం చేసింది. జిల్లావ్యాప్తంగా 8 ఆక్సిజన్ ప్లాంట్లు నుంచి నిరంతర ఆక్సిజన్ సరఫరాకు చర్యలు తీసుకుంది. లాక్‌డౌన్ నేపథ్యంలో ఆహార ఇబ్బందులు తలెత్తకుండా రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రూ.వెయ్యి చొప్పున్న ఆర్థిక సాయం అందించడంతో పాటు ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున 15 రోజులకు ఒకసారి రేషన్ బియ్యం ఉచితంగా పంపిణీ చేసింది.

ఉద్యమంలా వ్యాక్సినేషన్ : కరోనా వ్యాక్సినేషన్‌ను జిల్లా అధికారులు సమర్థవంతంగా నిర్వహించారు. తొలుత ఫ్రంట్‌లైన్ వారియర్స్‌కు వ్యాక్సిన్ అందించారు. వ్యాక్సినేషన్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టగా సత్ఫలితాలనిచ్చింది. దీంతో కోవిషీల్డ్, కోవాగ్జిన్ వ్యాక్సిన్లకు డిమాండ్ అమాంతం పెరిగింది. అందరికీ వ్యాక్సిన్ వేయించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంది. ఇంటింటికీ వెళ్లి వ్యాక్సినేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది.

ఇళ్లల్లోనే విపక్ష నేతలు : ఇప్పుడు ప్రజలపై ఎక్కడలేని ప్రేమ వలకబోస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అప్పట్లో బాధితులపై వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సైతం హైదరాబాద్‌కు పరిమితమై రాష్ట్రం వైపు కన్నెత్తి చూడలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. బాధితులకు అండగా వైఎస్సార్‌సీపీ నాయకులు సేవా కార్యక్రమాలు, నిత్యావసర సరుకులను అందించారని అంటున్నారు.

ప్రభుత్వ వైద్యమే ప్రాణం నిలిపింది



కోవిడ్‌తో బతుకుపై ఆశలు వదులుకున్న సమయంలో ప్రభుత్వ వైద్యమే నా ప్రాణాలు కాపాడింది. కరోనా పాజిటివ్ రావడంతో బతకడం కష్టమని భావించాను. ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఐసోలేషన్‌లో చేరాను. అక్కడి వసతులు, వైద్యులను చూసి బతుకుపై ఆశ కలిగింది. కొద్దిరోజుల్లోనే కోవిడ్ నుంచి కోలుకున్నాను. ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నానంటే ప్రభుత్వం అందించిన మెరుగైన వైద్యమే కారణం.
– గుమ్మడి అమృతరావు, ఎన్నార్పీ అగ్రహారం, ఉండి మండలం

ప్రభుత్వమే బతికించింది



నాకు, నా భర్తకు కోవిడ్ పాజిటివ్ రాగా ఏం చేయాలో పాలుపోలేదు. అందరూ భయపడ్డారు. అప్పట్లో వలంటీర్లు, వైద్యులు అందించిన సేవలు మరువలేం. భీమవరం క్వారంటైన్ సెంటర్‌లో చేర్పించగా రోజూ పోషకాహారంతో పాటు మందులు ఇవ్వడంతో త్వరగానే కోలుకున్నాం. నా భర్త ఇప్పుడు ఆరోగ్యంగా తాపీపని చేసుకుంటున్నారు. మేము కోలుకున్నామంటే ప్రభుత్వమే కారణం.
– బొబ్బనపల్లి బేబీ సరోజినీ, దుంపగడప, ఆకివీడు మండలం

మృత్యువును జయించి..



మా ఇంట్లో నేను, మా భార్య, కుమారుడు కోవిడ్ బారిన పడ్డాం. నరసాపురం, పాలకొల్లులో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళితే చేర్చుకోలేదు. బతుకుపై ఆశలు వదులుకున్న సమయంలో ప్రభుత్వం ఏలూరులో కోవిడ్ కేంద్రానికి తరలించి నెల రోజుల పాటు వైద్యం అందించింది. రూ.2.50 లక్షల వైద్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందించింది. ప్రభుత్వ సాయంతోనే మేం మృత్యువును జయించాం.
– ఉంద్రు పెద్దిరాజు, చిట్టవరం, నరసాపురం మండలం

నిజంగా ఇది పునర్జన్మే



2020 ఆగస్టులో నాకు కరోనా సోకగా వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది పాలకొల్లులో క్వారంటైన్ సెంటర్‌లో చేర్చారు. అక్కడి రోగులను ప్రభుత్వం కంటికి రెప్పలా చూసుకుంది. పౌష్టికాహారంతో పాటు సమయానికి మందులు ఇవ్వడం వలన కోవిడ్ నుంచి సురక్షితంగా బయటపడ్డాను. ఇది నాకు నిజంగా పునర్జన్మే. ఇంటి వద్ద గరాజీలు తయారుచేసి జీవనోపాధి పొందుతున్నాను.
– పిండి సూర్యావతి, అడవిపాలెం, పాలకొల్లు రూరల్

పైసా ఖర్చు లేకుండా..



2020లో నాకు కోవిడ్ పాజిటివ్ రాగా తణుకు కోవిడ్ సెంటర్‌లో చేర్పించారు. వారం పాటు అక్కడ వైద్యసేవలు అందించారు. వైద్యులు రోజూ మందులతో పాటు మూడు పూటలా పోషకాహారం అందించగా కొద్దిరోజుల్లోనే కోలుకున్నాను. గతంలో మాదిరి కులవృత్తి చేసుకోగలుగుతున్నా. ప్రభుత్వ చర్యలతో ఒక్క పైసా ఖర్చు లేకుండా బయటపడ్డాను. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాము.
– గండేపల్లి భోగమ్మ, అత్తిలి

సకాలంలో వైద్యం



నేను, నా భర్త కరోనా బారిన పడగా భీమవరం కోవిడ్ సెంటర్‌లో వైద్యం అందించారు. రోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం పెట్టేవారు. ఉదయం, సాయంత్రం వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేసేవారు. ప్రభుత్వం కోవిడ్ కేర్ సెంటర్లు ఏర్పాటుచేసి సకాలంలో వైద్యం అందించడం వల్లనే కరోనా నుంచి మేం ప్రాణాలతో బయటపడ్డాం.
– పైలా ఆదిలక్ష్మి, భీమవరం

వ్యవసాయం చేయగలుగుతున్నా..



నాకు కరోనా పాజిటివ్ రాగా వలంటీర్లు, వైద్య సిబ్బంది ధైర్యం చెప్పి భీమవరం క్వారంటైన్ సెంటర్‌లో చేర్చారు. వారం పాటు అక్కడ వైద్యులు చాలా జాగ్రత్తగా చూసుకున్నారు. రోజూ మందులు, పోషకాహారం అందించారు. నాలా చాలామంది ఇక్కడ కోలుకున్నారు. ఇప్పుడు వ్యవసాయ పనులు చేసుకుని ఆనందంగా ఉన్నానంటే ప్రభుత్వ వైద్యమే కారణం.
– బిరుదుగడ్డ సుందరరావు, పెదఅమిరం, కాళ్ల మండలం

సేవ చేసే భాగ్యం



విపత్తు సమయంలో ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని సీఎం జగన్ సార్ మా వలంటీర్లకు కల్పించారు. అయినవారే బాధితుల వద్దకు రాలేని సమయంలో మేం వారి చెంతకు వెళ్లి మందులు, పౌష్టికాహారం అందించాం. ఆరోగ్య సిబ్బందితో కలిసి డోర్ టూ డోర్ సర్వేలు చేశాం. బాధితులను కోవిడ్ కేంద్రాలకు తరలించాం. రెడ్‌జోన్లలో వైరస్ వ్యాప్తి కట్టడికి మా వంతు ప్రయత్నం చేశాం.
– దిగమర్తి పల్లవి, వలంటీర్, జిన్నూరు, పోడూరు మండలం

సీఎం సభకు అశేషంగా తరలిరండి

మంత్రులు కొట్టు, కారుమూరి పిలుపు



తాడేపల్లిగూడెంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తణుకులో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర, బహిరంగ సభ ఈనెల 15న భీమవరం నిర్వహించనున్నారని, తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు అశేషంగా తరలివెళ్లాలని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. తాడేపల్లిగూడెం కొట్టు అడ్డా అంటూ సీఎం జగన్ ఘన స్వాగతం పలకాలన్నారు. నియోజకవర్గం నుంచి భారీగా తరలివెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిద్ధం సభకు వెళ్లే వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుండుబోగుల నాగు, ముప్పిడి సంపత్‌కుమార్, కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, గుండుమోగుల సాంబయ్య, కైకాల శ్రీనివాసు, పాలమోను శ్రీనువాసు, బొద్దాని శ్రీనివాసు, తెన్నేటి జగ్జీవన్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

తణుకు అర్బన్: సీఎం జగన్ బస్సు యాత్ర, మేమంతా సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. తణుకులోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. సీఎం జగన్ సిద్ధం సభలు చారిత్రాత్మకంగా నిలుస్తున్నాయని, లక్షలాది మంది ప్రజానీకం అభిమానంతో తరలివస్తున్నారన్నారు. నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, జగనన్న అభిమానులు భీమవరం వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. పెత్తందార్ల దుష్టకూటమిని ఎదుర్కొనేందుకు పేదల పక్షాన పోరాడుతున్న జగనన్నకు అండగా నిలవాలన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, కాపు సంఘం అధ్యక్షుడు వంటిద్దు ఈశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

మేమంతా సిద్ధంకు పశ్చిమ సన్నద్ధం

- 15న భీమవరంలో సీఎం జగన్ బస్సు యాత్ర
- భీమవరం, ఉండి, ఉంగుటూరు మీదుగా పర్యటన
- భీమవరంలో బహిరంగ సభకు చురుగ్గా ఏర్పాట్లు
- పార్టీ అభ్యర్థులతో రీజనల్ కో–ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి సమావేశం



సాక్షి ప్రతినిధి, ఏలూరు: మేమంతా సిద్ధం యాత్రకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సన్నద్ధమైంది. కృష్ణా జిల్లా నుంచి పశ్చిమగోదావరిలోకి యాత్ర ప్రవేశించి ఏలూరు జిల్లా మీదుగా తూర్పుగోదావరి జిల్లాలోకి వెళ్లనుంది. ఉమ్మడి జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో బస్సు యాత్ర, భీమవరంలో బహిరంగ సభకు సంబంధించి చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 15న (సోమవారం) భీమవరంలోకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర ప్రవేశించనుంది.

ఘన స్వాగతానికి భారీ ఏర్పాట్లు

ఎన్నికల ప్రచారం తారాస్థాయి చేరిన తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర పశ్చిమలోకి ప్రవేశించనుంది. భీమవరంలో ముఖ్యమంత్రి బస్సు యాత్రకు అపూర్వ స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఉభయగోదావరి జిల్లా పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పార్టీ ముఖ్యులతో భీమవరంలో సమావేశం నిర్వహించారు. ఈనెల 15న లోసరి మీదుగా భీమవరం నియోజకవర్గంలోకి యాత్ర ప్రవేశిస్తుంది. అక్కడ నుంచి బర్రివానిపేట, తోకతిప్ప, గూట్లపాడురేవు, గొల్లవానితిప్ప మీదుగా భీమవరం శివారుకు చేరుకుంటుంది. భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి రోడ్‌షో ప్రారంభమై అంబేడ్కర్ సెంటర్, డీ–మార్ట్ మీదుగా బైపాస్ రోడ్డు చేరుకుంటుంది. అక్కడ బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. అక్కడి నుంచి ఉండి నియోజకవర్గంలోని ఉండి, ఉంగుటూరు నియోజకవర్గంలోని గణపవరం, నారాయణపురం మీదుగా తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లకు యాత్ర చేరుకోనుంది. ఈ క్రమంలో మూడు నియోజకవర్గాల్లో అపూర్వ స్వాగతాలు పలకడానికి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే భీమవరంలో జరిగే మేమంతా సిద్ధం సభకు పశ్చిమగోదావరి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి పార్టీ అభ్యర్థులు, పార్లమెంట్ అభ్యర్థితో పాటు అన్ని నియోజకవర్గాల నుంచి భారీ ర్యాలీని నిర్వహించనున్నారు. ఎన్నికల శంఖారావం పూరించాక మొదటిసారి జిల్లాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రానుండటం, పూర్తిస్థాయిలో పర్యటన ఉండటంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అట్టహాసంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

1,451 టన్నుల కందిపప్పు సరఫరా

ఏలూరు(మెట్రో): జిల్లాలో గతేడాది జనవరి నుంచి ఈ ఏడాది మార్చి వరకు రేషన్ కార్డు లబ్ధిదారులకు 1451.404 టన్నుల కందిపప్పు పంపిణీ చేసినట్టు జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కె.మంజు భార్గవి తెలిపారు. జిల్లాలో తెల్ల రేషన్ కార్డుదారులందరికీ కందిపప్పుతో పాటు బియ్యం, పంచదార, గోధుమ పిండి కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో కందిపప్పు కోసం డీడీలు కట్టిన రేషన్ డీలర్లందరికీ కందిపప్పు సరఫరా చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

మార్కులు తక్కువ వచ్చాయని..

ఉరి వేసుకుని ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

యలమంచిలి: ఇంటర్మీడియట్‌లో మార్కులు తక్కువ వచ్చాయని మనస్తాపంతో దొడ్డిపట్ల పంచాయతీ కుమ్మరిపాలెంనకు చెందిన ఓ విద్యార్థిని బలన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కుమ్మరిపాలెంనకు చెందిన నేదునూరి నరసింహారావు, లావణ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె నేదునూరి పావని నాగరత్న కావ్య (17) పాలకొల్లులోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. శుక్రవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో కావ్యకు 390 మార్కులు వచ్చాయి. తమ బంధువుల అమ్మాయికి ఇంకా ఎక్కువ మార్కులు రావడంతో ఆత్మన్యూన్యతా భావంతో మనస్తాపానికి గురైన కావ్య తన ఇంటి మేడపై ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే పాలకొల్లులోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం భీమవరం ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి నరసింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కాకి శివనారాయణ చెప్పారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

పోలవరం రూరల్: పోలవరం మండలం గూటాల గ్రామ సమీపంలోని గోదావరి నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు శనివారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పోలవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హెచ్‌సీ కె.శ్రీనివాసరావు చెప్పారు.

200 లీటర్ల సారా స్వాధీనం

పోలవరం రూరల్: జిల్లెళ్లగూడెం పంచాయతీ పరిధిలోని కుంకాల అటవీ ప్రాంతంలో పోలీసులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 200 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. బట్టీ నిర్వాహకుడు ఎం.రాంబాబు, మురళీకృష్ణలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సారా రవాణాకు వినియోగిస్తున్న రెండు బైక్‌లను సీజ్ చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ చెప్పారు.

9న ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో థాయ్‌లాండ్ టూర్

ఏలూరు (టూటౌన్): భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో థాయ్‌ల్యాండ్ టూర్‌ను వచ్చే నెల 9న నిర్వహించనున్నట్లు ఐఆర్‌సీటీసీ విజయవాడ ఏరియా మార్కెటింగ్ మేనేజర్ ఎం.రాజా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 9న హైదరాబాద్ నుంచి ఫ్లైట్‌లో బయలుదేరి థాయ్‌ల్యాండ్ రాజధాని బ్యాంకాక్ చేరుకుంటుందన్నారు. మొత్తం మూడు రాత్రులు, నాలుగు పగళ్లు ఈ యాత్ర ఉంటుందని, వచ్చే నెల 12న తిరుగు ప్రయాణంలో బ్యాంకాక్‌లో బయలుదేరి హైదరాబాద్‌కు చేరుకుంటామన్నారు. ఒక వ్యక్తికి రూ.57,415, ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు షేరింగ్ చేసుకుంటే ఒక్కో టికెట్‌కు రూ.49,040 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాల కొరకు ప్రవీణ్ సెల్ నంబర్ 92814 95848, రాజేష్ సెల్ 89773 14121 నంబర్‌లో సంప్రదించాలని రాజా కోరారు.

వేటకు లంగరు

- నేటి అర్ధరాత్రి నుంచి సముద్రంలో వేట బంద్
- 61 రోజులపాటు అమలులో కేంద్రం నిషేధాజ్ఞలు
- చేపల పునరుత్పత్తి సీజన్ వేళ ప్రతి ఏటా చర్యలు
- సముద్రం నుంచి తీరానికి చేరుకుంటున్న బోట్లు
- ఐదేళ్లుగా మత్స్యకార భరోసా అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున సాయం



సముద్రంలో వలకు చిక్కిన చేపలను ఒడ్డుకు తెస్తున్న మత్స్యకారులు

నరసాపురం: వేట బోట్లకు లంగరు పడింది. సముద్రంలో వేట నిషేధ సమయం రానే వచ్చింది. సముద్రంలో 61 రోజుల పాటు వేట సాగించే వీలు లేకపోవడంతో బోట్లు ఒడ్డుకు చేరుకుంటున్నాయి. నరసాపురం గోదావరి తీరానికి వేట బోట్లను తీసుకొచ్చి లంగరు వేస్తున్నారు. సముద్రంలో వేట నిషేధం ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానుంది. నేటి నుంచి పూర్తిగా సముద్రంలో వేట నిషేధం అమల్లో ఉంటుంది. చేపల పునరుత్పత్తి సీజన్ కావడంతో ప్రతి ఏటా ఏప్రిల్ 14వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకూ 61 రోజుల పాటు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సముద్రంలో వేట నిషేధం గత కొన్నేళ్లుగా అమలు చేస్తోంది. మళ్లీ జూన్ 14వ తేదీ అర్ధరాత్రి నుంచి బోట్లు సముద్రంలోకి వేటకు బయలుదేరి వెళతాయి. వేట నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలనే ఆదేశాలు ఉండటంతో మత్స్యశాఖ అధికారులు తీరంపై నిఘా పెట్టారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించి వేటకు వెళితే చర్యలు తీసుకుంటామని నరసాపురం మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్ల నుంచి మత్స్యకార భరోసా పథకాన్ని మత్స్యకారుల కోసం అమలు చేస్తోంది. వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ప్రత్యామ్నాయ ఉపాధి లేక ఖాళీగా ఉంటారు. వేట నిషేధం అమల్లో ఉండే రెండు నెలలకు గాను వేట సాగించే మత్స్యకార కుటుంబానికి రూ.10 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తోంది. ఇప్పటికి వేట నిషేధ సాయం 5 విడతలుగా మత్స్యకార భరోసా పథకం ద్వారా సొమ్ములు జమ అయ్యాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి నరసాపురం తీరంలో 1,635 మంది మత్స్యకార భరోసా లబ్ధిదారులు ఉన్నారు. గత టీడీపీ హయంలో వేట నిషేధ సమయంలో కేవలం రూ.4 వేలు మాత్రమే ఇచ్చేవారు. అదీ 173 మందికి మాత్రమే దక్కేది. అదీ సవాలక్ష ఆంక్షలతో లబ్ధిదారుల ఎంపిక జరిగేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు మత్స్యకార భరోసా పథకం ద్వారా కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందిస్తోంది. గత టీడీపీ హయాంలో ఆలస్యంగా ఆగస్టు నెలలో రూ.4 వేలు ఇచ్చేవారు. అయితే జగన్ సర్కార్ గత ఐదేళ్ల నుంచి మే నెలలోనే ఈ సొమ్మును అందించింది. గత ఏడాది మత్స్యకార భరోసా 1,635 మందికి అందించారు.

గత ఏడాది వాతావరణం అనుకూలించక పోయినా.. ఆదుకున్న జగన్ ప్రభుత్వం

గత ఏడాదంతా సముద్రంలో వేట కష్టంగా సాగింది. వరుస తుపాన్లతో ప్రకృతి కన్నెర్ర చేయడంతో వేట సవ్యంగా సాగలేదు. వేట నిషేధం గడువు ముగిసి జూన్ నుంచి వేట ప్రారంభించిన మత్స్యకారులను తుపాన్లు, వరదలు వేధించాయి. దీంతో జూలై, ఆగస్టు, నవంబర్ లాంటి సీజన్ నెలల్లో కూడా అగచాట్లు తప్పలేదు. దీంతో మత్స్యకార భరోసా, వేట బోట్లకు డీజిల్ సబ్సిడీ వంటి పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకుంది.

రోజుకు 150 బోట్లతో ముమ్మర వేట

నరసాపురం తీరంలో నిత్యం వేట సాగుతుంది. విశాఖపట్టణం, మచిలీపట్టణం, నెల్లూరు, తూర్పు గోదావరి, కాకినాడ తదితర ఇతర జిల్లాలకు చెందిన చెందిన మెకనైజ్డ్ వేట బోట్లు కూడా ఇక్కడ వేట సాగిస్తుంటాయి. మొత్తంగా ప్రతి రోజూ 150 వరకు బోట్లు వేట సాగిస్తాయి. ఏటా ఈ ప్రాంతం నుంచి రూ.300 కోట్ల వరకు మత్స్య సంపద లభించడం, ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతులు జరుగుతుంటాయి.



వేట నిషేధం కారణంగా బోట్లను తీరానికి చేరుస్తున్న మత్స్యకారులు

రెండు నెలలు ఖాళీగానే



ఇక ఈ రోజు నుంచి సముద్రంలో రెండు మాసాలు వేట సాగించకూడదు. ఈ రెండు నెలలు ఖాళీగానే ఉంటాం. మళ్లీ జూన్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తూ ఉంటాము. గత ఏడాది తుపాన్లు ఎక్కువగా రావడం వల్ల వేట సరిగా సాగలేదు. వేట నిషేధం సమయంలో సీఎం వైఎస్ జగన్ మాకు రూ.10 వేలు ఇచ్చి ఆదుకున్నారు.

– ఒడుగు మల్లిఖార్జున్, మత్స్యకార్మికుడు, నరసాపురం

రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుంది



వేట లేని రెండు నెలలు మాకు ఏపనీ ఉండదు. మేము ఇంకో పని కూడా చేయలేం. ఖాళీగా ఉండే ఈ రెండు నెలలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.10 వేలు ఇచ్చి ఆదుకుంటారు. నిజంగా ఈ రెండు నెలలు ఈ సొమ్మే కుటుంబ పోషణకు అక్కరకు వస్తోంది. ఐదేళ్ల నుంచి ఆలస్యం లేకుండా సొమ్ము ఇస్తున్నారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– వల్లభు శంకరరావు, మత్స్య కార్మికుడు

మత్స్యకారులకు అండగా నిలిచిందిలా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	సాయం (రూ.కోట్లలో)
2019	1,072	1.072
2020	1092	1.092
2021	1200	1.20
2022	1400	1.40
2023	1635	1.63

టీడీపీ ప్రభుత్వ హయంలో

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	సాయం (రూ.లక్షల్లో)
2014	–	–
2015	52	1.04
2016	46	0.92
2017	104	4.16
2018	173	6.92

బాలిక పెళ్లిని అడ్డుకున్న అధికారులు

ఏలూరు బాలికా సంరక్షణ కేంద్రానికి తరలింపు

భీమడోలు: భీమడోలు పంచాయతీ నాచేటిగుంటకు చెందిన ఓ బాలిక వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. నాచేటిగుంటకు చెందిన బాలిక ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ఆమెకు భీమవరానికి చెందిన ఓ యువకుడితో వివాహం జరుగుతుందనే సమాచారాన్ని స్థానికులు అధికారులకు వాట్సాప్ ద్వారా అందించారు. జిల్లా బాలికా సంరక్షణాధికారిణి సూర్యచక్రవేణి ఆదేశాల మేరకు ఐసీడీఎస్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు శుక్రవారం బాలిక ఇంటికి వెళ్లి వివాహన్ని అడ్డుకున్నారు. బాలిక తల్లిదండ్రులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. అయితే భీమవరంలో శనివారం వివాహం చేస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలికను ఏలూరు ప్రభుత్వ సంరక్షణ కేంద్రానికి శుక్రవారం రాత్రి తరలించామని భీమడోలు పీవో కేవీ విజయలక్ష్మీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేగం శనివారం చెప్పారు.

వైఎస్సార్ సీపీలోకి 20 టీడీపీ కుటుంబాలు



ఎమ్మెల్యే అభ్యర్థి కె.విజయరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు

లింగపాలెం: ధర్మాజీగూడెంలో టీడీపీకి చెందిన సుమారు 20 కుటుంబాలు సర్పంచ్ కొత్తూరి మౌనిక రమేష్ ఆధ్వర్యంలో చింతలపూడి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు సమక్షంలో శనివారం రాత్రి పార్టీలో చేరారు. వీరికి విజయరాజు పార్టీ కండువాలను కప్పి వైఎస్సార్ సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చల్లా శ్రీను ,కొత్తూరి గోపి కృష్ణ, కొత్తూరి రాటాలు, గురిజాల సురేష్, ఉప్పునాగప్రసాద్, సీహెచ్ రమేష్, వి.రవీంద్ర, వి.నాగరాజు, ఉప్పు శ్రీను, చల్లా రాంబాబు, చల్లా శివ, వి.రాజారావు, సీహెచ్.నాగేశ్వరరావు, వి.ఫణి, వెన్నంశెట్టి రాము, వి.నాగరాజు, గురిజాల సత్యం, దిలీప్ ఉండగా, వీరితో పాటు మరికొంత మంది పార్టీలో చేరిన వారికి విజయరాజు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. సీఎం జగన్ పాలన విధానం నచ్చి పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ మండలపు సాయిబాబు, మోరంపూడి జగన్, మండల పార్టీ అధ్యక్షులు కొఠారి మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి జ్ఞానారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు మేకల రాజు పాల్గొన్నారు.

వామ్మో.. మామిడి



మామిడికి పేరుగాంచిన నూజివీడులో మామిడి పండ్ల ధరలు మండుతున్నాయి. చిన్నరసం పండ్లు ఇప్పుడిప్పుడే మార్కెట్‌కు వస్తుండగా ధరలు సామాన్యులు కొనలేని విధంగా ఉన్నాయి. గంపల వ్యాపారులు వద్దే డజను చిన్నరసాలు రూ.300 నుంచి రూ.350 వరకు ధరకు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది నల్ల తామర దాడికి మామిడి పూతంతా మాడిపోయి దిగుబడి దారుణంగా పడిపోయింది. దీంతో ఊరగాయ పెట్టుకోవడానికే కాయలు దొరకని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో మామిడి పండ్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ ధరలను చూస్తుంటే ఇంక ఈ ఏడాది మామిడి పండ్లు ఏం తినేట్టు లేవని మధ్య, దిగువ తరగతి ప్రజలు నిరాశ చెందుతున్నారు.

– నూజివీడు

క్లుప్తంగా

సిద్ధం సభకు తరలిరావాలి



సిద్ధం సభకు పార్టీ శ్రేణులను ఆహ్వానిస్తున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: భీమవరంలో ఈ నెల 15వ తేదిన జరగనున్న సిద్ధం సభకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ పిలుపునిచ్చారు. జన సమీకరణలో భాగంగా శనివారం మండలంలోని వీరంపాలెం గ్రామంలో నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి వెంకటరామిరెడ్డి (పెద్ద బ్బులు) తదితరులు ఉన్నారు.

26 నుంచి మార్లమ్మ జాతర



మోదుగ గుంట గ్రామంలోని మార్లమ్మవారు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మోదుగ గుంట గ్రామ దేవత మార్లమ్మ వారి జాతర ఈ నెల 26 నుంచి 30వ తేది వరకు నిర్వహించ తలపెట్టినట్లు ఆలయ కమిటి కట్టా జానకీరామయ్య, కామన చంద్రరావు, ఏపూరి సత్యనారాయణ గుడ్ల సుబ్బారావు, గరగ మాణిక్యం తెలిపారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 26వ తేది రాత్రి 8 గంటలకు అమ్మవారి సేవ, 27 నుంచి 29వతేది వరకు ఇంటింటికి అమ్మవారు తిరుగుతారన్నారు. 29వ తేది రాత్రి ఆలయానికి చేరుకుంటారన్నారు. అదే రోజు గ్రామంలో బలిచాట కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 30వ తేదిన అమ్మవారికి భారీగా నివేదనలు సమర్పించడం జరుగుతుందన్నారు. ఐదు రోజులపాటు జరిగే జాతర మహోత్సవాల్లో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

విద్యార్థులకు అభినందనలు



ఇంటర్ విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ డివిజన్ సభ్యుడు రొక్కాల నాగబుజ్జి పేర్కొన్నారు. ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినీ విద్యార్థులకు శనివారం స్థానిక ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంధసేవా సంస్థ కార్యాలయంలో అభినందన సత్కారం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రొక్కాల ఆశీర్వాదం, కె.కిరణ్మయి, విద్యార్థులు పాల్గొన్నారు.

వేల్పూరు, కొమరవరం గ్రామాల్లో వలంటీర్ల రాజీనామా



కొమరవరంలో రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలంలోని వేల్పూరు, కొమరవరం గ్రామంలో 28మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ కార్యదర్శికి రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ నిజాయితీతో ప్రజలకు సేవ చేస్తున్నప్పటికీ తమను జనసేన, టీడీపీ నాయకులు రాజకీయంలోకి లాగారని, నాయకుల తప్పుడు ఆరోపణ చేయ డం వల్ల తీవ్ర మనస్థాపానికి గురై రాజీనామా చేస్తున్నామని చెప్పారు. కరోనా కష్టకాలంలో సైతం పనిచేసి ప్రజల మన్ననలు అందుకున్నామని తెలిపారు. వలంటీర్ల రాజీనామా పత్రాలను తణుకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీలలితకు అంజేశారు.

కె ఇల్లిందలపర్రులో 18 మంది వలంటీర్లు రాజీనామా

ఇరగవరం: మండలంలోని కె ఇల్లిందలపర్రు గ్రామంలో 18వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో కె.పద్మజ్యోతికి అందజేశారు.ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ నిజాయితీతో ప్రజలకు సేవ చేస్తున్నప్పటికీ తమను జనసేన, టీడీపీ నాయకులు రాజకీయంలోకి లాగారని, నాయకుల తప్పుడు ఆరోపణ చేయడం వల్ల తీవ్ర మనస్థాపానికి గురై రాజీనామా చేస్తున్నామని చెప్పారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపులకొడప వేంకటేశ్వర స్వామిని శనివారం ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్ కుమార్ ఆచార్యులు ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామివారికి విశేష సేవలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

తణుకులో ఎన్నికల ప్రచారంలో మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదర్శకంగా అందజేస్తున్న సంక్షేమ పథకాలు సంపూర్ణంగా మాకు అందాయని మా ఇంటి బిడ్డకు మేము అండగా నిలుస్తామని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు హౌసింగ్ బోర్డు కాలనీలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన రోజు నుంచి సీఎం జగన్‌మోహన్ రెడ్డి, ప్రజాప్రతినిధులంతా ప్రజల్లోనే ఉండాలనే ఆదేశాలతో మేము గడప గడపకు మన ప్రభుత్వం తదితర కార్యక్రమాలతో ప్రజల్లోనే ఉన్నామని చెప్పారు. ఇంటి గుమ్మంలోకి వెళ్తుంటే మహిళలంతా చిక్కటి చిరునవ్వులతో స్వాగతం పలుకుతున్నారని మమ్మల్ని ఓటగనవసరంలేదని మేము మీవెంటే ఉన్నామంటూ చెబుతున్నారని అన్నారు. రాష్ట్రంలో చదువుల విప్లవాన్ని తీసుకువచ్చి కార్మికుల పిల్లలు కార్మికులు కాకూడదనే ప్రధాన ఉద్దేశ్యంతో ఆ పిల్లలు కూడా డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్ ఆఫీసర్లుగా ఎదగాలని విద్యకు అత్యంత ప్రాధాన్యతనిచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కోట్లాది రూపాయిలు విద్యావ్యవస్థకు కేటాయించారని, ఆ ఫలితమే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో మొదటి స్థానాన్ని సాధించిందని చెప్పారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ మహిళా ధ్యక్షురాలు నూకల కనకదుర్గ, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉండవల్లి జానకి, వార్డు నాయకులు పైబోయిన ఏసుబాబు, ఎస్వీ జాకబ్‌బాబు, లారెన్స్ ఝాన్సీ, బెజ్జవరపు హేమశ్రీ, వేంద్ర ఎస్తేరురాణి, వెన్న రాణి, ధనలక్ష్మి, టి.శకుంతల, తోకల చంద్రకళ, శ్రీలత, ఎం.లలిత పాల్గొన్నారు.



తణుకు హౌసింగ్ బోర్డు కాలనీలో ఎన్నికల ప్రచారంలో సిద్ధం అంటున్న మంత్రి కారుమూరితో పార్టీ శ్రేణులు

జగనన్నతోనే సుపరిపాలన

అత్తిలి: రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో తిరిగి సీఎం చేయడానికి మీఅందరి సహాయ సహకారాలు అందజేయాలని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. శనివారం సాయంత్రం అత్తిలిలో పీఎంపీ, ఆర్ఎంపీలతో మంత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికి గడప వద్దకే సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పాలనను దేశంలో రాష్ట్రాలన్నీ ఏపీవైపే చూసే పరిస్థితి కలిగిందన్నారు. విద్యారంగంలో చంద్రబాబు హయాంలో 15వ స్థానంలో ఉంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక దేశంలో ప్రథమ స్థానానికి చేరిందన్నారు. పీఎంపీల భవన నిర్మాణానికి తనవంతు సహాయం అందజేస్తానని తెలిపారు. వచ్చేనెల 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ వాసు, సెక్రటరీ కృష్ణ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు గంటానాగరాజు, కంకటాల సతీష్, రంభ సూరిబాబు, మండలంలోగల పీఎంపీ, ఆర్ఎంపీలు తదితరులు పాల్గొన్నారు.



అత్తిలి: మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

గూడెం విద్యార్థికి బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న గూడెం విద్యార్థి ఉద్దగిరి కృష్ణవంశీ

తాడేపల్లిగూడెం: ఉదయ్‌పూర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంటులో ఎంబీఏ పూర్తి చేసి పట్టణానికి చెందిన ఉద్దగిరి కృష్ణవంశీ ఆల్‌రౌండ్ ప్రతిభ చూపించి బంగారు పతకం కైవసం చేసుకున్నారు. మార్కులతో పాటు, అన్ని విభాగాలలో ప్రతిభాపాటవాలను చూపించి వంశీ బంగారు పతకం పొందారు. ఈ విషయాన్ని ఆయన తండ్రి పంచాయతీరాజ్ విభాగంలో డీఈగా పనిచేస్తున్న వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. ఇనిస్టిట్యూషన్ స్నాతకోత్సవం సందర్భంగా ఈ పతకాన్ని ఇటీవల ప్రధానం చేశారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీటీసీ): పెదతాడేపల్లి 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతుల నిమిత్తం తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఈ నెల 15, 16 తేదీల్లో సోమవారం, మంగళవారం రెండు రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తాడేపల్లిగూడెం పట్టణం, రూరల్ మండలం, పెంటపాడు మండలంలోని అన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వెన్నుపోటుదారులకు చోటు లేదు

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

తాడేపల్లిగూడెం అర్బన్: వైఎస్సార్ సీపీ అధికారంలో పదవులు పొంది, లబ్ధి పొంది ఎన్నికల సమయంలో బైటకు వెళ్లిపోయిన వెన్నుపోటు దారులకు మళ్లీ పార్టీలో చోటులేదని, వారందరినీ కడవరకు పార్టీకి దూరంగా ఉంచుతామని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గ స్థాయి పార్టీ శ్రేణులతో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన అందజేశామన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే రెండేళ్లపాటు కరోనా మహమ్మారి దేశాన్ని అతలాకుతలం చేసిందన్నారు. కరోనా ప్రభావం మన రాష్ట్రంపై ఎంత త్రీవతను చూపిందో దానిని సమర్ధవంతంగా ఎదుర్కొని ప్రజలందరినీ కాపాడుకోగలగామన్నారు. ఎన్నికల అనంతరం వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కష్టపడి పనిచేసిన వారందరికీ సముచితస్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీలో లాభం పొంది ఎన్నికల్లో సహకారం అందజేయాల్సిన సమయంలో పచ్చకూటమి వైపు వెళ్లిన వారు అధోగతిపాలవుతారన్నారు. వాడుకొని వదిలేసే గుణం చంద్రబాబుకు పుష్కలంగా ఉందన్నారు. అదే రీతిని ఆపార్టీ నాయకులు ఉన్నారన్నారు. 2014 నుంచి 2019 వరకు మున్సిపల్ చైర్మన్‌గా పదవీ కాలం చేసి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పట్టణానికి ఏమి అభివృద్ధి చేశాడో చెప్పగలడా అని ప్రశ్నించారు. తెదేపా అధికారంలోకి ఉండి మున్సిపాల్టీలో తెదేపా నుంచి చైర్మన్‌గా ఉన్న వ్యక్తి ఏమీ చేయలేక వలస నాయకులతో చేతులు కలిపి పట్టణాన్ని అభివృద్ధికి దూరం చేశాడని దుయ్యబట్టారు. బీజేపీ నాయకులు దేవదాయ శాఖ మంత్రి, దివంగత పైడికొండల మాణిక్యాలరావు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తుంటే తెదేదపా వలస నాయకులతో జనసేన అభ్యర్థి అడుగడుగునా అడ్డుపడుతూనే ఉన్నాడని ఆరోపించారు. ఇకపోతే ప్రస్తుతం తెదేపా నాయకులు అవాస్తవాలు మాట్లాడుతూ ప్రచారం చేస్తున్నారని వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొన్ని పథకాలను చెప్పలేక పోవడం హాస్యాస్పదమన్నారు. ఏదేమైనా రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేగా తాను గెలుస్తామని 2వసారి అధికారం చేపట్టిన వెంటనే అందరికీ సమన్యాయం చేస్తామని మంత్రి కొట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గుండుబోగుల నాగు, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, పోలుమోను శ్రీనువాసు, బొద్దాని శ్రీనివాసు, గుండుమోగుల సాంబయ్య, ముప్పిడి సంపత్‌కుమార్, కైగాల శ్రీనివాసు, బోణం విజయనిర్మల, జడ్డు హరిబాబు, బూరా శ్రీను, ఎంపీపీ పానుకుమాటి శేషులత నియోజకవర్గ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

తణుకు టౌన్: రక్తదానం చేసి యువత ప్రాణదాతలు కావాలని పలువురు వక్తలు కొనియాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలోని అంబేడ్కర్ రమాబాయి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్, అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తణుకు డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో అంబేడ్కర్ యూత్ సభ్యులు 13 మంది స్వచ్ఛంధంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో తణుకు రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి కారుమంచి యోహాను, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సభ్యులు గారపాటి నాగరాజు, యూత్ సభ్యులు రాజేష్, మద్దిల యేసు, సరెళ్ల సతీష్, బయ్యే రాజేష్, దిడ్ల సామ్యూల్, గెడ్డం చంద్రశేఖర్, మద్ది రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

మండపాకలో బ్యాడ్మింటన్ పోటీలు

మండలంలోని మండపాకలో డా.బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సమతా యువజన సంఘం ఆధ్వర్యంలో షటిల్‌బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. మూడు రోజులు పాటు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ పోటీల్లో వివిధ మండలాల నుంచి మొత్తం 30 జట్లు పాల్గొన్నాయి. వీరితో విన్నర్‌గా కొవ్వూరుకు చెందిన తీపర్తి బాబు, తీపర్తి చిన్నులు నిలిచారు. రన్నరగా ఉండ్రాజవరం మండల కాల్దరి గ్రామానికి చెందిన కొండపల్లి శ్రీను, చీపుల్ల వెంకట్రావులు నిలిచినట్లు తెలిపారు. ఈపోటీల్లో విజేతలకు అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం జరిగే వేడుకల్లో నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తాని తెలిపారు.



తేతలిలో రక్తదానం చేస్తున్న యూత్ సభ్యులు

ఓటమి భయంతోనే సీఎం జగన్‌పై దాడి

తాడేపల్లిగూడెం: ఓటమి భయంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ దాడులకు తెగబడుతోందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా.చీకటిమిల్లీ మంగరాజు అన్నారు. విజయవాడలోని సింగ్‌నగర్ డాబా కోట సెంటర్‌లో సీఎం జగన్‌పై శనివారం రాత్రి జరిగిన దాడి ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. మంగరాజు మీడియాతో మాట్లాదారు. జగనన్న చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. ఐదేళ్ల జగన్‌పాలనను వేలెత్తి చూపించేందుకు వీలు లేక ప్రతిపక్షాలు ఎన్నో కుట్రలు, కుతంత్రాలు చేస్తోందన్నారు. అయితే సంక్షేమ పాలకుడు జగనన్నపై ప్రజలు అంతులేని అభిమానాన్ని పెంచుకున్నారన్నారు. వీటిని తట్టుకోలేక, వచ్చే ఎన్నికల్లో ఎలాగో ఓటమి తప్పదన్న భయంతో టీడీపీ నేతలు జగనన్నపై ఈ రకంగా దాడులు చేస్తున్నారన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ఇంపల్స్ విద్యార్థుల ప్రతిభ

తణుకు టౌన్: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో తణుకు ఇంపల్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ రామ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు తమ కళాశాలకు చెందిన సీనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థి ఏ పవిత్ర 987 మార్కులు సాధించినట్లు తెలిపారు. సీఈసీలో ఏ బాలభారతి 969 మార్కులు, బైపీసీ విభాగంలో సీహెచ్ హరి సత్య కిరణ్ 943 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీ విద్యార్థి ఏ మానస 449 మార్కులు, సీఈసీలో కే హెచ్ చంద్రిక 542 మార్కులు, బైపీసీలో ఎం ప్రహర్షిత 394 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు డి కేశవరావు, ఎం సూరిబాబు, ఎం. రాజేంద్ర ప్రసాద్, డి రవితేజ అభినందించారు.

లోఓల్టేజీ సమస్యలు పరిష్కరించాలి

పెనుగొండ: ఆచంట వేమవరం శివారు పడమటపాలెం దళిత కాలనీలలో చాలా కాలంగా లోఓల్టేజ్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు సమస్యను పరిష్కరించాలని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆచంట ఎలక్ట్రికల్ ఆఫీస్ నందు ఏడీ నాగేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. పుష్పరాజ్ మాట్లాడుతూ చాలా కాలంగా లోఓల్టేజ్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సత్వరం సమస్య పరిష్కరించకపోతే మాల మహానాడు ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

విజయం మనదే

ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు

తణుకు అర్బన్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని పలువురు నాయకులు అన్నారు. గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలే తమ పార్టీ అభ్యర్థుల విజయానికి సోపానాలన్నారు. సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి మద్దతు పలకాలని ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు కోరారు. తణుకు 1వ వార్డులో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించడమే ప్రధాన లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ 58 నెలల కాలం పనిచేసిందన్నారు. అదే సంక్షేమం తిరిగి 2024లో కూడా అందాలంటే మన ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరిని, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, నియోజకవర్గ మైనారిటీ సెల్ మహిళాధ్యక్షురాలు ఫహీమా, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉండవల్లి జానకి, ఝాన్సీ లారెన్స్, పైబోయిన ఏసుబాబు, ఎస్వీ జాకబ్‌బాబు, పైబోయిన సాయితేజ, ఆత్మకూరి రాజు, కుంపట్ల ఇందిర, ములగాల విజయలక్ష్మి, కుడుపూడి చంద్రరావు, బెజ్జవరపు సాక్షి, డి.ప్రకాష్, కారుమంచి యోహాన్, తాటిపర్తి వాసు, ఉమ్మిడిసింగ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దువ్వలో ఇంటింటి ప్రచారం

తణుకు టౌన్: రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని కోరుతూ మండలంలో పలు గ్రామాల్లో నాయకులు ప్రచారం చేశారు. శనివారం తణుకు రూరల్ మండలం తేతలి, దువ్వ, వేల్పూరు గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా కారుమూరి నాగేశ్వరరావును, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. తేతలి గ్రామంలో వైఎస్ ఎంపీపీ గారపాటి పద్మజ, గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, వలవల కిషోర్, నాయకులు, కోట స్వామీజీ, భూపతిరాజు రామకృష్ణంరాజు, భీమ చంద్రరావు, వీరవల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. దువ్వ గ్రామంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, గ్రామ కమిటీ అధ్యక్షుగు గోపాల కృష్ణ, మండల రైతు విభాగం అధ్యక్షుడు దండు వెంకట కృష్ణంరాజు, నాయకులు శనగన ఏడుకొండలు, సునీల్, కొయ్యల సుబ్బారావు, సూర్యారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.మండలంలోని వేల్పూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, ఎంపీటీసీలు తాడిపర్తి సుజాత, పంచాయితీ సభ్యులు, ఏఎంసీ డైరెక్టర్ బండి పార్వతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తణుకులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి సుబ్బారావు



తేతలి గ్రామంలో ఇంటింటికి ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కొట్టు సత్యనారాయణను గెలిపించాలని ప్రజలు కోరుతున్న కొట్టు తనయుడు రాజేష్, కుమార్తె కాంచన

కొట్టు సత్యనారాయణను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలి

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలు శాంతిభద్రతలతో, ప్రశాంతమైన జీవనం సాగించాలంటే ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలని కొట్టు తనయుడు రాజేష్, కుమార్తె కాంచన ప్రజలను కోరారు. శనివారం 7వవార్డులో ఎన్నికల కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వైఎస్సార్ సీపీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు తనయుడు రాజేష్, కుమార్తె కాంచనలు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ప్రతి ఇంటికి సంక్షేమం అందాలన్న, అభివృద్ధి చెందాలన్న రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా కొట్టు సత్యనారాయణను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి

ఇరగవరం: మండలంలోని 21 గ్రామాల్లో శనివారం మండల నాయకులు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని తెలిపారు. అలాగే ఎమ్మెల్యేగా కారుమూరి నాగేశ్వరరావును, ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలలను గెలిపించాలని కోరారు. డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వెలగల సాయిబాబా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, కె ఇల్లిందలపర్రు, ఇరగవరం సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, చవ్వాకులు శ్రీనివాస్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు మామిడి శెట్టి శ్రీనివాస్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కుడిపూడి నాగ సత్యనారాయణ, ఆయా గ్రామాల్లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.